

# అంతర్లోకాలు

పోర్టికోలో సడెన్ బ్రేకుతో 'పాంటియక్' కారు ఆగింది. చెట్లకు నీళ్ళుపోస్తున్న రంగయ్యా, పరధ్యానంగా విండో పేన్సు తుడుస్తున్న జాఫరుసాయిబూ మత్తు వదిలి పరుగెత్తుకొచ్చారు.

'ఏం దది' అన్న రంగయ్యమాటా, 'క్యాహై సాహబ్' అన్న జాఫరుసాయిబు హడావిడీ, రామారావు గట్టిగా నొక్కిన బేటరీ హారన్ అరుపులో కలిసిపోయాయి.

అప్పటి కేమంత చీకటి పడలేదు. అల స్యంగా ఆఫీసునుంచి వచ్చేవాళ్ళు యింకా యిళ్ళకు ఎంతో ఆపేక్షగా ఆఫీసు ఫైళ్ళు తెచ్చుకుంటున్నారు. నైట్ డ్యూటీ శ్రద్ధగా చెయ్యడంకోసం పగలంతా నిద్రపోయిన ఘూర్కా, చేతిలో బేటరీ లైటూ,లాటీతో తయారై, రోజు మామూలుగా కొట్టే సలాముకొట్టి వెళ్ళిపోయాడు.

రామారావు డ్రాయింగ్ రూమ్‌లోంచి గబగబా ఆఫీసు రూమ్‌లోకి వెళ్లి అక్కడ కోటు విసిరిపారేసి, వంటింట్లోకి వెళ్ళిపోయాడు. అక్కడినుంచి గబగబా బెడ్ రూమ్‌లోకి వచ్చాడు తూలుతూ.

శారద గాబరాగా చేతులో ఉన్న మల్లెపూలదండ వదిలేసింది. గదిలో ఒకమూల పేకముక్కలతో బాబు మేడకడుతున్నాడు. అనుకోకుండా పక్కకు తిరగడంతో పేక మేడకు చెయ్యి తగిలి అదికాస్తా కూలిపోయింది.

రామారావు రేడియోలోంచి వస్తూన్న పాటకచ్చేరీని మూసేశాడు. 'టై' అయినా విప్పుకోకుండా సోఫాలో కూలబడ్డాడు. శారద దగ్గరగా వచ్చి 'టై' విప్పుతూ 'ఏం జరిగింది' అన్నట్లు చూసింది.

రామారావును మాట్లాడించలేకపోయింది శారద కాస్సేపు. 'ఏం నాన్నా' అని పలకరించాడు బాబు.

ఇంత సేపటిబట్టీ గడ్డకట్టుకుపోయిన రక్తం ఒక్కసారిగా ప్రవహించినట్లు రామారావు బాబును చేతుల్లోకి తీసుకుని

రంగారావు అనే మిత్రుడి మిత్రుడు తటస్థపడి తనదగ్గర ఉద్యోగం యిచ్చాడు. ప్రొద్దుట్నుంచి సాయంత్రందాకా పనిచేసేవాళ్ల మీద అజమాయిషీ చెయ్యడం. వారాని కోసారి వాళ్లకి కూలి బట్వాడా చెయ్యడం. రాత్రిళ్లు లెక్కలు చూసుకోవడం. మిగిలిన గంటలు నిద్రపోవడమూను—నిత్యకృత్యం. చిన్న చిన్న కంట్రాక్టులు చేస్తున్న రంగారావు గారు విశాఖపట్టణంలో కాస్త పెద్ద కాంట్రాక్టులు దొరికేసరికి 'రంగారావు అండ్ కంపెనీ'గా మారిపోయారు. కేవలం గుమాస్తాగా ఉన్న రామారావు ఆ కంపెనీలో భాగస్వామిగా మారిపోయాడు. నమ్మకమే పెట్టుబడిగా




అమాంతంగా హృదయానికి హత్తుకున్నాడు.

రామారావు కళ్ళముందర పదేళ్ల జీవితం సెల్యులాయిడ్‌మీద చిత్రంలాగ గిర్రుమని తిరిగింది. పదేళ్లక్రితం యిదే హైద్రాబాద్ నగరపు రోడ్లమీద చిరిగిన కోటూ అరిగిన చెప్పులూ వేసుకుని తెరచి ఉన్న ప్రతి ఆఫీసు తలుపూ తట్టాడు. కనిపించిన ప్రతి ఆఫీసు తలుపూ తట్టాడు. కనిపించిన ప్రతివాడినీ ఏమాత్రం మొగమాట పడకుండా తనకొక్క మామూలు గుమాస్తా ఉద్యోగం యిప్పించమని అడిగాడు. బ్రతిమాలాడు. ఇంకా యిప్పించకపోతే కోప్పడ్డాడు. నీరసపడ్డాడు. ఇట్లా ఉంటూఉండగా



మారిపోయింది రామారావుకు. ఇంతకీ రోజులు కలసొచ్చాయి. విపరీతంగా లాభాలొచ్చాయి. హిమాయత్‌నగర్‌లో యిల్లూ, 'పాంటియక్' కారూ, డబ్బున్న, అందమైన, చదువుకున్న శారదను భార్యగానూ అమర్చింది జీవితం. మరే లోటూ ఉండకూడదన్నట్లు పెళ్లయిన రెండేళ్లలో చలాకీ అయిన కొడుకు పుట్టాడు. కంపెనీలలో షేర్లూ, యింకా కొన్ని వ్యాపారాల్లో భాగమూ, తను సొంతంగా చేసే కాంట్రాక్టులూ, యివన్నీ చూసుకోవడానికి అబిద్ రోడ్డులో 'మాడరన్ ట్రేడర్స్' అనే సొంత ఆఫీసూ - అంతా వెలిగిపోతోంది.

మూడునెలల క్రితమే రంగారావుగారు యాక్సిడెంట్‌లో చచ్చిపోతే, ఆయన వ్యవహారాలన్నీ తానే చూస్తున్నాడు. రామారావు దగ్గర లోపాయకారీగా కొంతడబ్బు ఉంది - యిద్దరికీ చెందినదీ, ఏ ఎకౌంటుకూ చెందనిదీను. దానిని రంగారావుగారి కొడుకు ప్రభాకరానికి యియ్యక్కర్లేదని నిశ్చయించుకున్నాడు రామారావు. తను చేసిన దానికి యీ డబ్బు ఉంచేసుకున్నా వచ్చిన యిబ్బంది ఏమీ లేదనిపించింది. ఆ డబ్బు ఏ రకంగా వచ్చిందో చచ్చి మరో లోకానున్న రంగారావుగారికీ, బ్రతికున్న రామారావుకీ మాత్రమే తెలుసు, వ్యాపారాన్ని అభివృద్ధి చెయ్యడంలో తనూ ముఖ్యమైన పాత్ర వహిస్తూ వస్తున్నాడు కాబట్టి, తను ఆ డబ్బు ఉంచేసుకోవచ్చనే నిర్ణయానికి వచ్చేశాడు.

ఆఫీసునుంచి త్వరగా యింటికి వద్దామని బయలుదేరి కారు జోరుగా నడిపిస్తూ 'కింగ్‌కోటీ' వైపు వస్తున్నాడు. 'ఒకవేళ ప్రభాకరం ఉన్నపళంగా వచ్చేసి ఆ డబ్బు అడిగితే ?.... ఆ కుర్రాడికి తెలుసా యీ సంగతులు ? వాళ్ళ నాన్న చెప్పి ఉండడూ యింట్లో? ప్రభాకరం ఆ మాత్రం తెలిసికొని ఉండడూ ? అయినా డబ్బుకోసం ఏమిటి యీ లోభం? పదేళ్ల క్రితం నేనెవరు ? ఉంటూ ఉంటూ హఠాత్తుగా రంగారావుగారు పోయారే ? ఆ యాక్సిడెంట్ నాకు మాత్రం కాగూడదూ ? అమ్మో.... శారదా, బాబూ ఏమైపోతారు ?

టర్నింగ్‌లో ఎవరో సైకిల్‌మీద రోడ్డు క్రాస్ చేస్తున్నాడు. సడన్‌బ్రేక్ వేశాడు. కుక్కపిల్ల బద్ధకంగా అడ్డొచ్చింది. పెద్ద చప్పుడు. గట్టి అరుపు సైకిలు ఫర్లాంగు దూరంలో పడింది. సైకిలుపైన కుర్రాడు ఎగిరిపడ్డాడు ఎక్కడో.

కారులోంచి బయటకు దిగాడు. కుక్కపిల్ల చివరిసారిగా మూలిగింది, సైకిల్ ఒక పక్కా, కుర్రాడు మరోపక్కా పడిఉన్నారు.

అటూ యిటూ చూశాడు. పెద్ద జన సమ్మర్ద మేమీలేదు. అక్కడ యింక ఏ మాత్రం ఆగినా తనని తన కారుతోబాటు పోలీసుస్టేషనుకు తీసుకెడతారు. ఆ కుర్రాడికి యీ లోపుగా ప్రాణం పోవడమో, ఏ కాలో చెయ్యో విరగడమో జరుగుతుంది. కోర్టూ, పోలీసులూ తనను కటకటాల వెనక్కు పంపిస్తారు. ఆస్థి కంపెన్సేషన్‌కూ, కోర్టు ఖర్చులకూ అయిపోతుంది. తన బ్రతుకు బజారు పాలౌతుంది. తను ఎంతగానో ప్రేమించిన శారదా, బాబూ ఎటూగాకుండాపోతారు. అందుకని ఎవ్వరూ రాకముందే కారు స్టార్ట్‌చేసి వెళ్లిపోఎడం మంచిదనుకున్నాడు. కళ్లు చీకట్లుకమ్మాయి. కారు స్టార్ట్‌చేసి వేరే రూట్‌లో. విపరీతమైన స్పీడ్‌లో యింటికి చేరుకున్నాడు. దారిలో మరో రెండు యాక్సిడెంట్లు తప్పించుకున్నాడు. పోలీసుకాన్‌స్టేబుల్సు విజిల్సువేస్తూన్నా తప్పించుకుని వచ్చేశాడు.

* * *

'ఎందుకంత గాబరా ? ఆఫీసులో అన్నీ సవ్యంగా ఉన్నాయా ?' అని అడిగింది శారద. సమాధానం రాకపోవటం చూసి 'దారిలో ఏమైనా యాక్సిడెంటు కాలేదు కదా' అంది నాలిక కొరుక్కుంటూ.

'అ.... యాక్సిడెంటు అయింది'.

'ఆ...'

'అవును. ఒక కుక్కపిల్లా, కుర్రాడూ కారుక్రిందకు వచ్చేశారు.'

'ఆ ?...'

'అవును, వాళ్లు ఏమయ్యారో తెలియదు. బహుశః....'

'ప్రమాదం జరిగి వుంటుందంటారా ? అయితే వెంటనే హాస్పిటల్‌కు ఫోన్‌చేసి అంబులెన్సు తెప్పించకపోయారా ? పారిపోయి వచ్చేశారనుకోరూ ?'

ఈ ప్రశ్నకు రామారావు సమాధానం చెప్పలేదు. ఒళ్లంతా హూనం అయిపోయి నట్లనిపించింది. ఈజీఛైర్‌లో అట్లాగే పడుకుని నిద్రపోయాడు.

ప్రొద్దున్న ఆలస్యంగా లేచాడు. అప్పటికే జాఫరుసాయిబు ఏదో పనిచేసి చేతులు దులుపుకుంటున్నాడు. రంగయ్య పూల కుండీలు సరిచేస్తూన్నాడు. ఫ్లవర్‌వేస్‌లో పెట్టడానికి కట్టిన పూలగుచ్ఛాన్ని రంగయ్య చేతులోనుంచి తీసుకుంది శారద. తనే అమర్చింది వాట్లని. బాబు తలవంచుకుని ఏదో చదువుకుంటున్నాడు. ఆ క్షణంలో తనను ఎవ్వరూ పట్టించుకోవటంలేదన్న భావం కలిగింది రామారావుకు. తను లేకుండా ప్రతిదీ జరిగిపోతూనేఉంది. తన డబ్బుతో కొన్న ప్రతిదీ, తనతో నిమిత్తం లేకుండా. యాంత్రికంగాసాగిపోతూ ఉంది.

కిటికీలోంచి బయటి ప్రపంచాన్ని చూశాడు రామారావు. ఎనిమిది అయిందో లేదో అందరూ హడావిడిగా అటూయిటూ తిరుగుతున్నారు. అంతా మామూలుగానే ఉంది. చేతిలో బ్రష్-పేస్టూ, బుజంమీద తువాలూ వేసుకుని, బాత్‌రూమ్‌లోకి వెడుతూ తననితాను చూసుకున్నాడు. రాత్రి వేసుకున్న సూటు వంటిమీదలేదు. ఎవరు తన సూటు విప్పింది ? శారద అయిఉండాలి ?

అంత వళ్లుతెలియకుండా పడుకున్నట్లు తెలుసుకొని ఊరుకున్నాడు రామారావు. బాత్‌రూమ్ దగ్గరకువచ్చి అన్నీ సరిగ్గా ఉన్నాయోలేవో రంగయ్యను కనుక్కొని వెళ్లిపోయింది శారద.

బాత్‌రూమ్‌నుంచి బయటకు వచ్చి టేబుల్‌దగ్గర కూర్చున్నాడు కాఫీ తాగటానికి రామారావు.

'గుడ్‌మార్నింగ్ డాడీ' అన్నాడు బాబు.

'ఈ రకమైన అలవాట్లు దేనికి చేశానా' అనిపించింది రామారావుకు ఆ క్షణంలో.

'రాత్రి నేనేమైనా కలవరించానా' అన్నాడు రామారావు, కాఫీ తాగబోతూ, శారదవైపు తిరిగి.

'కలవరించటమేమిటి ? ఇంట్లో వాళ్ళందరినీ గాబరాపెట్టేశారు కదూ ? అది సరేగాని, మీ ఫ్రెండు మూర్తి వచ్చారట కలకత్తానుంచి. సెకండుషో పిక్చర్‌కు వస్తారేమో నని ఫోన్ చేశారు రాత్రి. మీరు చాలా అలసిపోయి విశ్రాంతి తీసుకుంటున్నారని చెప్పాను. సరే యివాళ మిమ్మల్ని ఆఫీసులో కలుసుకుంటా నన్నారు.'

'నే నిప్పుడెవ్వరినీ కలుసుకోదలుచుకోలేదు'.

శారదకు ఒక్కసారిగా ఏదో అనిపించింది. జరగకూడనిది ఏదో జరిగిందనే అనుమానం వేసింది.

'కాఫీ చల్లారిపోతోంది' అన్నది, ఇంక అనటానికి ఏమీ తోచక.

ఒక్కగుక్కలో కాఫీతాగి బల్లమీద కప్పు పెట్టేశాడు.

'ఏమని కలవరించాను శారదా ?'

'ఆ...డబ్బు. .ఎందుకివ్వాలి ? యాక్సిడెంటు...పోలీసులు...శారద...బాబు...అని ఏమేమో అస్పష్టంగా అన్నారు.'

'నేను కలవరించినప్పుడు నువ్వు తప్ప మరెవ్వరూ లేరుకదా ?'

'రంగయ్య లేచివచ్చి 'అయ్యగారు కలవరిస్తున్నా'రని అంటే నేను పక్కగదిలోంచి లేచివచ్చాను.'

'రంగయ్యని పిలు ?' అన్నాడు రామారావు సీరియస్‌గా.

రంగయ్య చేతులుకట్టుకు వచ్చి నిలబడ్డాడు.

'రంగయ్యకి అయిదురూపాయి లియ్యి' అన్నాడు శారదతో.

శారద ఆశ్చర్యంగా చూసింది. ఎందుకని అడగకుండా యినప్పెట్టెలోంచి ఫెళ

ఫెళలాడుతూన్న కొత్త అయిదురూపాయల నోటు యిచ్చింది.


'దేనికి బాబూ' అన్నాడు. దేనికో తెలియక రంగయ్య. అక్కడున్న ఎవ్వరికీ ఏమీ తెలియదు కాబట్టి ఎవ్వరూ ఏమీ అన లేదు.

మర్నాడు మామూలుగా ఆఫీసుకువెళ్ళి పోదామనుకున్నాడు రామారావు. మామూలుగా కనిపించాలనే కోరికతో. ఆఫీసుకు కారులోగనక వెళ్ళకపోతే అనుమానం కలుగుతుంది. షెడ్డులోంచి కారు బయటకు తీస్తే 'ఫ్రంట్ మడ్‌గార్'కు రెండు సొట్టలు పడ్డాయి.

ఇంత గడబిడలోనూ మెరపులాంటి ఆలోచన వచ్చింది. తనే ఏ చెట్టుకో కారు 'డాష్' యిచ్చినట్లు రిపోర్టు చేస్తే? అదీ సాయంత్రం జరిగిందని చెబితే తన డిఫెన్సులో ఏలిబీ ఉంటుంది. అదే సైముకు యిద్దరుముగ్గురు ట్రాఫిక్ పోలీసులు విజిల్సు కూడా వేశారు కాబట్టి వాళ్ళు కారు నంబరు నోట్ చేసుకుని 'చలాన్' చెయ్యొచ్చు. అన్నీ సరిపోతాయి. ఇనస్పెక్టర్ రాఘవ రావుకూ, లాయరు రంగనాధంగారికీ, డాక్టరు తిరుపతయ్యగారికీ శారదచేత ఫోను చేయిస్తే బాగుంటుందని తోచింది. అయితే మొదట తను కారుని హిమాయత్‌నగర్ యివతల జంక్షన్‌లో చెట్టుదగ్గర వదలిపెట్టి రావాలా? అక్కర్లేదా? ఆ కారులో తనతో బాటు జాఫరు సాయిబు ఉన్నట్లు చెప్పడం మంచిది. జాఫరుసాయిబుకు 'డ్రయివింగ్' కూడా వచ్చునుకాబట్టి కారు డాష్ యివ్వగానే, యిల్లు దగ్గరే వుందికాబట్టి సాయిబు డ్రయివ్ చేసుకుంటూ కారు తోసుకువచ్చాడని చెప్పవచ్చు.

కారు షెడ్డులో పెట్టేశాడు రామారావు. ఆఫీసుకు వెళ్ళకుండా మళ్ళా యింట్లోకివచ్చిన రామారావును చూసి గాబరాపడింది శారద.

తను అనుకున్న 'ప్లాన్' అంతా శారదకు చెప్పాడు.



"బాగా దమ్ముపీల్చి విడవ్వయ్యా."
"బాగా దమ్ము పీల్చాలంటే ఒక చిలుము గంజాయి కావాలండీ."

'అసలు ఏమీ జరగకుండా గడబిడ పడుతున్నా రనుకుంటా? మీరు అనుకున్న ప్రమాదం జరగకపోయివుంటే? అనవసరంగా అందరినోళ్ళల్లో పడిపోతారేమోనని? మీపేరు చెప్పకుండా హాస్పిటల్‌కు ఫోన్ చెయ్యండి. 'ఇటువంటి యాక్సిడెంట్ జరిగిన పేషంటు వచ్చాడా' అని అడగండి అంది శారద.

రామారావుకు ఒక్కసారి తల తిరిగినట్లయింది. ఏదో తన చేతిలోంచి జారిపోతూన్నట్లు అనుమానం వేసింది. 'తన డబ్బుతో భోగాలు అనుభవిస్తూ తనకే ఎదురు తిరుగుతారేమో వీళ్లు' అనే అనుమానం వేసింది.

'శారద నాకు ఎదురు తిరుగుతుందా ఏమిటి కర్మ?'

'అవును. ఏం? ఇంత డబ్బు వస్తుంటే చేదా?'

'డబ్బు ఏం చేసుకుంటుంది నేను లేకపోతే?'

'డబ్బు...డబ్బే కావలసింది...డబ్బే...'

'డబ్బు...డబ్బు...'అని గట్టిగా అరిచాడు రామారావు.

శారదకు ఏమీ అర్థంకాలేదు. రామారావు ఎందుకిట్లా అరుస్తూన్నాడో

రంగయ్యకి అయిదు రూపాయలు ఇస్తే మెహర్బానుగా పుచ్చుకున్నాడు. జాఫరు సాయిబు మాత్రం తను చెప్పే వాట్లకు ఒప్పుకుంటాడని గ్యారంటీ ఏమిటి? 'కాని ఎవడు ఒప్పుకోడు డబ్బిస్తే? ఇష్టా యిష్టాలతో నిమిత్తం లేకుండా ఎంతమంది ఎంత మందితో... అవును. కొనెయ్యొచ్చు. డబ్బుతో ఎవర్నయినా కొనెయ్యొచ్చు. ఆశలు, ఆశయాలు, ఆదర్శాలూ, బ్రతుకూ, చావూ - ఒకటేమిటి, అన్నిటినీ రూపాయలతో కొనెయ్యొచ్చు. ప్రతిదానికీ ఒక ప్రైస్ ఉంది. అది యివ్వగలిగి ఉండాలి. అంతే....'

వెంటనే అధికార హోదాలో అన్నాడు.

'మన సాయిబును పిలు శారదా'

సాయిబు ఎదురుగావచ్చి నిలబడ్డాడు. రంగయ్యకూడా వచ్చి పక్కనే నిలబడ్డాడు.

తలుపులు మూసేశాడు రామారావు. అందరికీ భయంవేసింది. ఆ క్షణంలో మర్డరర్‌లాగా కనిపించాడు రామారావు.

గడియారం ఎనిమిది గంటలు కొట్టింది ఆగి ఆగి శ్వాసపీల్చే రోగిలాగ.

'నిన్న రాత్రి జరిగిందంతా మర్చిపోండి' అన్నాడు రామారావు.

'ఏం జరిగిందండీ' అని యిద్దరూ ఒకే సారి అన్నారు.

'వినండి జాగ్రత్తగా. నేను దారిలో డాష్యిచ్చి వచ్చాను కారుకు. కాదు కాదు. నువ్వు....ఏం సాయిబూ. వినిపిస్తోందా, నువ్వు నా పక్కన ఉన్నావు.'

'లేను సాహబ్'

'సాయిబు డ్రాయింగ్‌రూమ్ అద్దాలు తుడుస్తున్నాడు' అంది శారద అందుకుంటూ.

'కాదు. నా పక్కన ఉన్నాడు. నేను చెప్పేది పూర్తి కానిదే ఎవ్వరూ మాట్లాడకండి.'

ఎవ్వరూ కిక్కురుమనలేదు ఏ క్షణంలోనైనా జేబులోంచి ఆరుగుళ్ళ రివాల్వర్ తీసి నిలబెట్టి అందరినీ వరసగా కాల్చేసి, మళ్ళా ఏమీ ఎరగనట్లు కాఫీ తాగేసేలాగ ఉన్నాడు. వజ్రంలోని కర్కశత్వంతో భయంకరంగా మెరుస్తున్నాయి రామారావు కళ్ళు.

'మే మిద్దరం కార్లో వస్తుంటే. నువ్వు' అని మళ్లా జాఫరుసాయిబు వైపుతిరిగి 'మనం కారులో చాలా స్పీడ్‌గా వస్తున్నాం' శారదవైపు తిరిగి అన్నాడు 'నువ్వుదబ్బున యింటికి రమ్మని కబురుచేశావు జాఫరు సాయిబుతో.'

'నేనా !'

'ఆ,..నువ్వే...మధ్యలో అడ్డంరాక... నేను ఆఫీసు క్లోస్ చేసుకుని వస్తున్నా. కారు చాలా స్పీడ్‌గా డ్రయివ్ చేసుకుంటూ వస్తున్నాం. నువ్వు...ఏయ్ జాఫర్‌సాయిబు, నువ్వు 'కుక్కపిల్ల' అని గట్టిగా అరచావు. నేను సడన్‌బ్రేక్ వేశాను. అప్పుడు కారు కంట్రోలుతప్పి హిమాయత్‌నగర్ జంక్షన్ యివతలగా చెట్టుకు డాష్ యిచ్చింది. కుక్కపిల్ల బ్రతికి పారిపోయింది. కారుకు ఫ్రంట్ మడ్‌గార్డ్‌కు సొట్టలుపడ్డాయి. నాకు గాబరావేసింది. కారుమాత్రం చెడిపోలేదు. నేను డ్రయివ్ చెయ్యబోతే, నువ్వే, ఏయ్ జాఫరుసాయిబూ! నువ్వే డ్రయివ్ చేసుకుంటూ ఇంటికి వచ్చేశావు. అదీసంగతి. తెలిసిందా ?'

'అదేమిటి బాబూ ?'

'అది అంతే'.

'శారదా. యినస్పెక్టరు రాఘవరావు గారికి ఫోనుచేసి నన్ను పిలు...ఫోన్ నంబరు జ్ఞాపకం ఉందా ? 4444...ఆగు... కాస్సేపు ఆగు...ఏమోయ్ రంగయ్యా, నేను రాత్రి ఏమీ కలవరించలేదు, తెలిసిందా ?'

'అదేటి బాబయ్యా. తమరు.'

'వినిపించడంలా..నేను ఏమీ కలవరించలేదు. ఇది నువ్వు జ్ఞాపకం ఉంచుకోవలసినవిషయం... ఇప్పుడు ఫోన్ చెయ్యి శారదా. రాఘవరావుగారికి.

అప్పుడు అర్థమైంది రంగయ్యకు ఐదు రూపాయలనోటు పెళుసుదనమూ, దాంట్లో గుచ్చుకునే నిజమూను.

రాఘవరావుగారు పోలీసు స్టేషనులో లేరనీ. రాగానే చెబుతామనీ అక్కడ డ్యూటీలోవున్న హెడ్‌కాన్‌స్టేబుల్‌చెప్పాడు.

'వీళ్లకి ఇక్కడే అన్నం అది వండించు' అని కొంచెంఆగి 'మన డాక్టరు తిరుపతయ్య గారికికూడా ఫోనుచెయ్యి, ఒకసారి రమ్మని. మర్చిపోయా. ప్లీడరు రంగనాథంగారిని రాత్రికి భోజనానికి రమ్మనిపిలు...ఇక మీరు వెళ్లి మీ పనులు చూసుకోండి'

అంతా భీతావహంగా. నిశ్శబ్దంగాఉంది.

రామారావు అవాళ ఆఫీసుకు వెళ్లదల్చుకోలేదు.

శారద దగ్గరగా వచ్చి కూర్చుంది. రామారావు అక్కడనుంచి లేచి వెళ్లిపోయాడు. శారద మళ్ళా అన్నది—'మీరు అనవసరంగా గాబరా పడుతున్నారేమోననిపిస్తోంది నాకైతే. వాళ్ళకూ వీళ్ళకూ ఫోన్‌చేసి బెడద తెచ్చిపెట్టుకుంటూన్నట్లనిపిస్తోంది. ఎవడిమీదో కారు ఎక్కిస్తే వాడు ఊరుకుంటాడుగనకనా? వాడు ఊరుకున్నా వాడి తాలూకువాళ్ళు ఊరుకుంటారు గనకనా ? వాళ్లు వచ్చినప్పుడు చూసుకుందాం. ఈ లోగా కారు సొట్టలు తీయించి పెయింట్ వేయించేస్తే మడ్‌గార్డ్స్ సొట్ట పడ్డట్లు తెలియదుగూడాను.

రామారావుకు శారద చెప్పినది రైటని తెలిసినా ఒప్పుకోవటం యిష్టం లేదు.

కాస్సేపటికల్లా ఇనస్పెక్టర్ రాఘవరావు గారు వచ్చారు కంగారుగా.

సోఫాలో ఏదో మాదిరిగా కూర్చుని వున్నాడు రామారావు. 'ఏమండీ ఏదో ఫోన్ చేశారట గాబరాగా'.

'అవునండి, నిన్న సాయంత్రం మా యింటిదగ్గర జంక్షన్‌లో స్పీడ్‌గా డ్రయివ్ చేస్తూ చెట్టుకు డాష్ ఇచ్చానండీ...'

'అరెరె. కారు చెడిపోయిందా ? మీకేమైనా దెబ్బలు తగిలాయా ? ఎవ్వరికీ ప్రమాదం ఏమీ లేదుకదా?'

రామారావు గాబరా పడబోయేటట్టున్నాడు చూస్తే. వెంటనే శారద అందుకుని అంది.

'ప్రమాదం ఏమీ లేదండి. నేను యింటికి దబ్బున రమ్మని కబురు చేశాను. స్పీడ్‌గా డ్రయివ్ చేసుకుంటూ వచ్చారు. ప్రక్కన జాఫరుసాయిబుకూడా ఉన్నాడులెండి'.

'అహా....అట్లాగా....ఏడీ జాఫరు సాయిబు?'

జాఫరుసాయిబువచ్చి నిలబడ్డాడు మేకప్ కడుక్కోని క్లౌన్‌లాగ.

'ఏమోయ్ జాఫరూ, ఏమిటి సంగతి? కారు చెట్టుకు డాష్ ఇప్పించేశావేమిటి?'

'లేదండి'

జాఫరుసాయిబు. ప్రక్కగదిలో ప్లేట్లు సర్దుతూన్న రంగయ్యవైపూ. రామారావు వైపు కళ్లని ఆరిపోతూన్న గ్యాస్‌లైట్లలాగ ఆడించాడు.

ఫీలింగు కడిగేసుకున్న ముఖంతో రామారావు సిగరెట్ అంటించి, ఇనస్పెక్టర్ చేతి కొక సిగరెట్ యిచ్చాడు.

'మరి దేనికింత గాబరాపడ్డట్టు' అన్నాడు ఎంతో అనుమానంగా ఇనస్పెక్టర్.

'ఉట్టిపున్నేనికి బాబుగారు దడిసిపోయారు' అన్నాడు రంగయ్య. ఆ సమయంలో రంగయ్యకి సానుభూతే కలిగిందో, లేక పుచ్చుకున్న అయిదు రూపాయలు యింకా అరగలేదో మరి.

హాలులో కాలింగ్ బెల్ మ్రోగింది. ఎవ్వరో చూడటంకోసం రంగయ్యా, వాడి వెంట జాఫరూ పరుగెత్తారు.

రామారావు ముఖంలోకి ఒక్కసారి భయంతో కూడిన విసుగు వచ్చింది. 'ఎవరు?' అన్నాడు.

ఇనస్పెక్టరు ఆశ్చర్యపోయాడు.

అది కనిపెట్టి శారద అంది 'డాక్టరుగారేమో వచ్చింది' అని.

'ఎందుకింత హడావిడిగా అందరికీ ఫోను చేశారు?...కొంపతీసి పేపరువాళ్లకు గూడా న్యూస్ యిచ్చారుగాదు కదా ?'

డాక్టరుగారొచ్చారని చెప్పడమూ ఆయన రావడమూ జరిగింది.

'ఏమిటి? ఎవరికి సుస్తీగా ఉంట?'

శారద చెప్పింది. చెప్పినంతసేపూ ఆశ్చర్యంగా విన్నాడు డాక్టరు, స్టెతస్కోప్‌తో గుండెల్ని పరీక్షచేశాడు.

'చాలా వేగంగా కొట్టుకుంటున్నాయి కదూ' అన్నాడు రామారావు.

'యామ్ ఐ ఆల్‌రైట్, డాక్టర్?'

'యు ఆర్ పర్ఫెక్ట్లీ ఆల్‌రైట్. మీకేం? నిల్చున్న పళంగా మేకపోతును తినేసేలాగ ఉన్నారు.'

'అమ్మయ్య' అని కుర్చీలో కూర్చుండిపోయాడు రామారావు.

అందరూ ఒకళ్ల ముఖంవైపు మరొకళ్లు చూస్తూ వుండిపోయారు. అక్కడకువచ్చిన వాళ్లకు ఎవరు ఎందుకు వచ్చిందీ తెలియక, ఎవరూ ఎవర్నీ ఏమీ అడగలేక కూర్చుండిపోయారు.

పనిచేసేవాడికి కాఫీ పురమాయించి వచ్చింది శారద. కాఫీ వచ్చింది. తాగారు.



"మన దేశమును పాలించన మొగలు చక్రవర్తులలో అక్బర్ కుమారుడు సలీమ్‌రాకుమారుడి చిత్రం అది. ఇతడే జహంగీరు అనుపేరుతో——"

"కాదు సార్! మీరు చూశ్నేదు కామాలు, మాహిష్మవతీ పురమేలే ఇంద్రద్యుమ్నమహారాజు కుమారుడు శృంగారకేతన రాకుమారుడు మాస్టార్! మేమంతా కళ్ళారా చూశాం, యీ బాలూగాణ్ణి అడగండి కావలిస్తే, రాత్రి వాడూ కనిపించాడు థియేటర్లో!"

---

మరోగంట దొర్లింది.

'నేను వస్తానండి' అంటూ ఇనస్పెక్టర్ రాఘవరావు వెళ్లిపోయాడు.

'మరి నేనూ వస్తా' అంటూ డాక్టరు తిరుపతయ్యగారు లేచి వెళ్లిపోయారు.

అంతా నిశ్శబ్దంగావుంది కాస్సేపు.

'మీరు ఆఫీసుకు వెళ్లండి నా మాటవిని' అంది శారద.

'నేను కులాసాగా ఉండటం మీకెవ్వరికీ యిష్టం లేనట్టుగా వుందే'

'అదేమిటి? వింతగా మాట్లాడుతున్నారే ?'.

'బాబు ఏడీ ?'

'స్కూలుకెళ్లాడేమో...ఏం ?'

'ఏమీలేదు. ఉంటే, వాడిని ఒకసారి యిట్లా తీసుకురా.'

బాబును తీసుకొచ్చింది శారద. ఆఖరుసారి చూసినట్లుగా చూశాడు బాబువైపు.

'ఏమిటింత గాబరా ?'

శారద నిజంగా గాబరాపడింది.

'నీకు తెలియదు శారదా. నేనేంచేశానో? ఉన్నపళంగా నన్ను అరెస్టుచేసి, ఆస్థి వేలం వేసేసి...'

'ఛీ...ఏమిటి ఆ పాడుమాటలు ?'

దూరంనుంచి మాటల చివరలు విన్న జాఫరుసాయిబూ, రంగయ్యా కళ్ళు వత్తుకున్నారు బాధగా.

ఫోన్ బెల్ మోగింది.

శారదవైపు రామారావూ, రామారావు వైపు శారదా చూశారు. ఎవ్వరూ ఫోన్ రిసీవ్ చెయ్యలేదు. టెలిఫోన్ బెల్ అట్లాగే మోగుతూనేవుంది.

బాబు రిసీవరు పైకిఎత్తి 'హలో' అన్నాడు.

ఇద్దరికీ ప్రాణం లేచివచ్చింది.

'నాన్నగారూ మీకు ఫోను' అని అందించాడు రిసీవర్.

'ఎక్కడనుంచి...' అని అందుకుంది శారద బాబుచేతిలోంచి.

'హలో... రామారావుగారి యింటి నుంచే...ఒహో...మూర్తిగారా..నిన్న ఫోన్ చేశారుకదూ...' శారద రామారావును సంజ్ఞలతో అడిగింది. ఇంట్లో లేనని చెప్పమన్నాడు.

'హలో....యింట్లో లేరు....అర్జంటు పనిమీద బయటికి వెళ్లారు....ఆఫీసుకా....కాదు..కాదుఏదో పనిమీద..రాత్రికి యింటికి వస్తారా....చెప్పమంటారా ఆయనతో....అట్లాగే...తప్పకుండా రండి'

పక్కకు తిరిగేసరికి రామారావు వద్దని సంజ్ఞచేశాడు. అప్పటికే రిసీవర్ క్రాడిల్‌లో పెట్టేసింది శారద.

'తలుపులు వేసిరా, శారదా'

తలుపులువేసి వచ్చింది శారద.

ఇనప్పెట్టె తీశాడు.

'ఇప్పుడు యినప్పెట్టె దేనికి తీశారు ?'

'పనుంది'

నోట్ల కట్టలు పైకి తీశాడు రామారావు.

'ఇవి యాభై వేలు....ఇవి పాతిక వేలు. మొత్తం డెభ్భైఅయిదు వేలు...విను. నన్ను ఆపుచెయ్యకు. ఈ డబ్బు నాదికాదు. చచ్చిపోయిన రంగారావుగారిది. దీన్లో నాకూ వాటా ఉంది. ఇది నేను ఆయన కొడుక్కి, అంటే ప్రభాకరానికి యివ్వకుండా ఎగ్గొడదామనుకుంటున్నా. నువ్వు యీ డబ్బు తీసుకుని మీ నాన్నగారిదగ్గరకు వెళ్ళు. నీ పేరుమీద, షేర్లూ. నేషనల్ సేవింగ్ సర్టిఫికట్లూ కొనమను. నువ్వు డబ్బు తీసుకుని వెళ్ళిపోవటం ముఖ్యం. వాడెప్పుడైనా యిక్కడకు రావచ్చును....'

మనిషి చిట్టచివరి మెట్టుమీదకు పడిపోయిన చాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి రామారావు చేసే ప్రతి పనిలో.

'పోన్లెద్దురూ, పాపిష్టి డబ్బు. మనకు కావలసినంత ఉంది. అయినా రంగారావు గారు బ్రతికుండగా...'

'ఏమిటి శారదా నువ్వనేది ? మీరందరూ అవసరమొస్తే నన్ను బజారున పెట్టేవాళ్ళేనన్నమాట ?'

రామారావు యీరకంగా మాట్లాడటం యిదే మొదటిసారి.

ఆఫీసునుంచి ఫోను వచ్చింది — తన కోసం యిద్దరు వ్యాపారస్థులు కాచుకుని కూర్చున్నారనీ, అవసరమైన పని ఉందనీను.

'కాస్సేపు ఆగి వస్తా'నని ఫోను చేశాడు.

మళ్ళీ ఫోను వచ్చింది. కోపంగా రిసీవరు తీశాడు. బొంబాయినుంచి ట్రంక్ కాల్.

సజన్‌లాల్ అండ్ కంపెనీ ప్రొప్రయిటరూ, వాళ్ళ పార్టనర్. ఎగ్రిమెంటుమీద సంతకం పెట్టడానికి మర్నాడు ప్లేన్‌లో వస్తూన్నారని ఫోన్‌లో అందినది సమాచారం.

మర్నాటిదాకా తను బ్రతికి ఉంటాడా? తన ఫ్రెండ్, యినస్పెక్టర్ రాఘవరావ్ అరెష్టు చెయ్యడూ ?

ఒక ఆలోచన తట్టింది. ఈ యాక్సిడెంటును గురించి ఏమూలైనా ఉందేమోనని లోకల్ పేపర్ చూశాడు. లేదు....ఇంకా వాళ్ళ ఆచూకీలోకి రాలేదేమో ?

ఎవరో వచ్చారని చెప్పాడు రంగయ్య యింతలోకే.

'ఎవరు ?....'

మిత్రుడు మూర్తి !

'ఏమిటోయ్ ? ప్రైమ్‌మినిస్టరునైనా ఎపాయింటుమెంటుతో కలుసుకోవచ్చు. నువ్వు మరీ బిజీ బిజినెస్‌మాగ్నేట్‌వి అయి కూర్చున్నావ్ ?'

శారద వచ్చింది.

'నన్ను గుర్తుపట్టారా' అన్నాడు మూర్తి శారదతో.

'ఫోన్‌లోనే మీ గొంతు గుర్తుపట్టాను'

'పోనీలెండి. రామారావుకు గుర్తు లేకపోయినా మీకైనా గుర్తున్నాం....'

అంతా ఎట్లాగోఉండటం చూసి 'ఏమిటి కాఫీ అయినా యిస్తావా లేదా, మీ వూరొస్తే....' అన్నాడు మూర్తి.

శారద కాఫీ తీసుకువచ్చి యిచ్చింది.

'అంతా కులాసాయేగా ?'

శారదకు మాట్లాడటం అవసరం అయింది.

'నిన్న మీ అన్నగారు కుక్కపిల్లమీదకు కారు ఎక్కించారు....'

'కుక్కపిల్లమీదకేగా, కన్నెపడుచుమీదకు కాదుగా ?'

అందరూ నవ్వేశారు కాఫీతాగేస్తూ.

బాబు గదిలోకి వచ్చాడు.

'ఓహో, రామారావు దియంగర్ ఏమిటి వీడు?'

'నా పేరు రాహుల్' అన్నాడు నమస్కరిస్తూ.

ఎంతో భీభత్సంగాఉన్న రోజు రంగు మారింది — అప్పటినుంచి మరోకాస్సేపటి దాకా. బాగా 'టెన్షన్'తో బిగిసిపోయి బరువెక్కిన రామారావుకి కొంచెం 'రిలీఫ్' కలిగింది, మూర్తినిచూసి కాస్సేపు మాట్లాడేసరికి.

'నువ్వు బయటకు వెళ్ళటమంటూ ఏమీ లేదేమిటి ?' అన్నాడు మూర్తి.

రామారావు తెల్లటిగోడవైపు వెల్లవేసిన ముఖంతో చూశాడు.

'నీ పెట్రోలు ఏమీ ఖర్చుకాదులే. నేను యింకో ఫ్రెండ్ కారు తీసుకువచ్చా. దాంట్లోనే వెడదాం రా పోనీ '.

బయటకు కదిలారు. శారదకూడా వెంట బయలుదేరింది.

మళ్ళా అదేరూట్. అదే కింగ్‌కోటీ రోడ్డు !

'ఇంకొక రోడ్డుమీదనుంచి వెడదాం' అని చెబుదామని నోటిదాకా వచ్చింది. మళ్ళా ఎందుకో ఊరుకున్నాడు రామారావు.

'కింగ్‌కోటీ రోడ్డు మలుపు... నిన్న యిక్కడే....మూర్తి చూస్తే డిటెక్టివ్‌లాగ కనిపిస్తున్నాడు. పోలీసు డిపార్టుమెంటు వాళ్ళు ఫ్రెండ్స్‌ను యిటువంటి పనులకి పురమాయిస్తారట....' అనుకుంటున్నాడు రామారావు.

కింగ్‌కోటీ మలుపు తిరిగింది. ఒక్కసారి గట్టిగా అరచి .కళ్లుమూసుకున్నాడు రామారావు.

సడన్‌గా బ్రేక్‌వేశాడు మూర్తి. అర్థం కాక ఐదునిమిషాలు ఊరుకున్నాడు.

శారద గాబరాగా చూసింది. మూర్తి కారు స్టార్టుచేశాడు. గబగబా టాంక్‌బండ్ మీద వెళ్లిపోతోంది. ఒకచోట ఆపుచేసి దిగారు అందరూ.

అప్పుడు ఏమి అడిగినా చెప్పేస్థితిలో లేడు రామారావు.

'ఏమిటోయ్. అదోలాగ వున్నావు?'

'ఏమీలేదండి. నిన్నసాయంత్రం కారు క్రింద కుక్కపిల్ల పడింది. అప్పటినుంచీ ఆయన అలాగే...'

'ఈ భూతదయ ఎప్పటినుంచిబాబూ?' అని నవ్వేశాడు మూర్తి.

నవ్వలేకపోయాడు రామారావు. అందరూ తనను చూసి నవ్వుతూన్నా రనిపించింది. ప్రకృతిలో ప్రతిదీ తనను పిలిచి పిలిచి వెక్కిరిస్తున్న ట్లనిపించింది దారిన పోయే ప్రతివాడూ తనవైపు వేలుపెట్టి చూపించి 'వీడు మర్డరర్' అని అరుస్తూన్నట్లుగావుంది.


'నాకు తలనొప్పిగావుంది'

'చావనీవోయ్ కుక్కపిల్లని.... మనుషులు చస్తుంటే లెక్కలేదు. న్యూయార్కులో రోజు కెంతమంది కార్లక్రిందపడి, కార్లలో పడి. కార్లపైనపడి, కారుపడి, ఖతం అయిపోతారో తెలుసా? ఇంక టోకియో సంగతి చెప్పనేఅక్కర్లేదు. అక్కడ కార్ల క్రిందపడి చావడం ఒక స్పెషల్ ఆర్టు....'

ఇంత హ్యూమరూ హుస్సేన్‌సాగర్‌లో కలిసిపోయింది.

కారు 'డ్రయివ్' చేసుకుని యింటికి వచ్చేశారు. రామారావునీ, శారదనీ డ్రాప్ చేసి వెళ్లిపోయాడు తర్వాత కలుస్తానంటూ.

ఇంటికొచ్చేటప్పటికల్లా జాఫరు సాయిబూ, రంగయ్యా కుక్కిన పేనుల్లాగ నక్కిఉన్నారు. వాళ్లు ఏ క్షణంలోనైనా




"చూడండి ఎదురింటి భార్యాభర్తలు ఎంత అన్యోన్యంగా ఉంటారో? ఆయన ఆఫీసుకు వెళ్ళబోయే ముందు రోజూ ఆవిడ బుగ్గమీద ఇలా గిల్లి వెళ్తూంటాడు. మీరు అలా ఎందుకు చేయరు?"
"(పరాగ్గా) నా కింకా ఆవిడతో పరిచయం కాందే ఎలాగా?"

---

పారిపోవచ్చు. ఏదైనా చెయొచ్చు. పోలీసులకు వెళ్లి వాళ్ళు తెలుసుననుకున్న నిజాన్ని చెప్పెయ్యొచ్చు. అప్పుడు నిలువునా కొంప మునగవచ్చు.

'మీకోసం....'

మాట పూర్తి కాకుండానే 'ఎవరు' అన్నాడు రామారావు.

'ప్లీడరు రామనాధంగారు....'

'అవును రాత్రికి భోజనానికి రమ్మని ప్రొద్దున్న ఫోన్ చెయ్యమన్నారుకదూ'అంది శారద.

'అవును ఫోన్ చెయ్య మన్నానుకదూ' అన్నాడు రామారావు మాట సవరించుకుంటూ.

మాట వినపడి ప్లీడరుగారు బయటకు వచ్చారు.

'ఏమిటి విశేషం? భోజనానికి రమ్మని పిలిచారట'

'అబ్బే ప్రత్యేకంగా ఏమీ లేదు...'

'మరి'

'మనం చాలాకాలం అయింది కదూ కలుసుకుని?'

'అవు నవును'

భోజనం చేశారు వాళ్లు ముగ్గురూ ఏమీ మాట్లాడకుండానే. కుర్చీలో కూర్చుంటూ ప్లీడర్‌గారు అడిగారు—

'ఏమిటి, మీరు కారు డాష్‌యిచ్చారట...'

'ఎవరు చెప్పారేమిటి?'

'ఎవరు చెప్పడమేమిటి? మీరు కారు డాష్ యివ్వడం అనే అతి ముఖ్యమైన పని చేస్తే అది మీ లీగల్ ఎడ్వయిజర్ అయిన నాకు తెలియకుండా ఎలా పోతుందీ అని'

'అయితే యిది పురజను లందరికీ తెలిసిందన్నమాటే.'

'పేపర్‌లో న్యూస్ కూడా వస్తేను. చూడండి కావలిస్తే........బిజినెస్‌మాన్

రామారావు డాష్డ్ హిజ్ కార్ ఎగెనెస్ట్ ఎ ట్రీ నియర్ ....'

'ఏది...అని బలవంతంగా లాక్కు న్నాడు న్యూస్ పేపర్ని ప్లీడరుగారి చేతి లోంచి.

'ఎందుకంత గాబరా?'

'అవును నాకెందుకు గాబరా'

'పడిన కుక్కపిల్ల కుండాలిగాని.'

ప్లీడరుగారికి ఏమీ అర్థం కాలేదు. కాస్సే పుండి వెళ్లిపోయాడు. ప్లీడరుగారికి యీ కథ నౌకర్లు చెప్పి ఉండా లనుకున్నాడు రామారావు.

రామారావు జీవితానికి ఆ రాత్రి చివరి దేమో ననిపించింది. ఒక్కసారి ఎలుగెత్తి అరుద్దామనీ, బావురుమని ఏడుద్దా మనీ అనిపించింది. జాఫరు సాయిబునూ, రంగ య్యనూ పిల్చి, తను చెప్పినదంతా మర్చి పొమ్మనీ, తనకోసం వాళ్ళను ఆడమన్న నాటకం ఆడక్కర్లేదనీ చెప్పేద్దా మను కున్నాడు.

కాని ఊరుకున్నాడు.

మర్నాడు పొద్దున్న ప్రభాకరం రామా రావుయింటికి వచ్చాడు. ప్రభాకరాన్ని చూడ గానే శారద–

'రావోయ్, ప్రభాకరం రా!' అంటూ ఆప్యాయంగా పిలిచింది. 'కాలికి ఆ కట్టేమిటి? తలకు ఆ బాండేజ్ ఏమిటి'అంది గాబరాతో.

బాబుమాత్రం భయంవదలి ఎక్కడ నుంచో హాలులోకి వచ్చాడు. ప్రభాకరం దగ్గరకు తీసుకున్నాడు బాబును.

'అలా చూస్తావేమిటి పిన్నీ....మొన్న దారిలో పడ్డానులే.... బాబాయి యింట్లో లేరా పిన్నీ'

శారదకు ఏమి సమాధానం చెప్పాలో తెలియలేదు. ప్రభాకరం మాట విని రామా రావు హాలులోకి వచ్చాడు. ప్రభాకరం కుర్చీలోంచి లేవబోయాడు. జారి పడి పోయాడు. రామారావు గాభరాగా లేవ దీశాడు. ప్రభాకరం జాలిగా రామారావు కళ్లల్లోకి చూశాడు.

'ఏమిటి ప్రభాకరం యీ కట్లన్నీను?'

ప్రభాకరం సమాధానం చెప్పకుండా ఉంటే బాగుండు ననిపించింది రామారావుకు ఆక్షణంలో.

'పాపం! ప్రభాకరం....మూడు నెలల్లో ఎంత మార్పు....సంపాదిస్తూన్న తండ్రి అమాంతంగా పోవడం....ఏదైనా యింతే నేమో? తను ఎంతో ఆప్యాయంగా ప్రేమి స్తూన్నవాళ్లూ, కావలసినవాళ్ళూ, కళ్ళముం దరనుంచి అయిపోయిన సినిమాలో మనుషుల్లాగ అదృశ్యమౌతున్నారు. అన్నీ యింతేనా?....' అనిపించింది రామా రావుకు. ప్రతిదీ తనను పైమెట్టుమీదనుంచి చిట్టచివరి మెట్టుమీదకు బలవంతంగా తోసే స్తూన్నట్లనిపించింది. ఒక్కసారిగా మెట్ట వేదాంతం చుట్టుకుంది. పుల్లలు లాగేసిన పిచ్చుకగూడులాంటి ముఖంతో ఏమీ అన కుండా ఊరుకున్నాడు రామారావు.

మొన్నసాయంత్రం ఆరుగంట లవుతుం దనుకుంటా. కింగ్‌కోటీ దగ్గరనుంచి ఫ్రెండ్ సైకిల్‌మీద వస్తూన్నా....'

'ఎప్పుడు? మొన్న సాయంత్రమా? కింగ్‌కోటీ దగ్గరనుంచా? సైకిల్‌మీద.... ఆరుగంటల ప్రాంతంలోనా....'

'అవును, బాబాయ్. వస్తూంటే టర్నింగ్ దగ్గరకొచ్చేసరికి ఎవడో బ్రూట్ కారు డాష్‌యిచ్చాడు....'

'ఆ...'

'ఎప్పుడు? ఎప్పుడు జరిగింది ప్రభాకరం! మొన్నసాయంత్రమా?' అంది శారద గాబరాగా.

'అవును పిన్నీ...నాన్నగారు పోయి నప్పటినుంచీ అమ్మకు అంతా అయో మయంగా వుంది. మా వ్యవహారా లేమిటో బాబయ్యగారికే తెలుసు. అవి ఆయన చూడ వలసిందే. నేను చదువుకుంటున్నాను. నాకేంతెలుసు చెప్పు?'

'మరి మీ అమ్మగారు ఏ మంటున్నారు' అంది శారద.

'అమ్మే అంది యీ మాట. నాన్న గారూ, బాబయ్యా, వ్యాపారంలోనూ, జీవితంలోనూ ఒక్కటిగా మెలిగారట. బాబయ్య పదేళ్ళక్రితం కుర్రాడుగా వచ్చి నప్పటినుంచీ అమ్మకు తెలుసట. మమ్మల్ని అన్యాయం చెయ్యడని మా అమ్మ నమ్మకం...'

కళ్లల్లో నీళ్ళు నిండుకున్నాయి రామా రావుకు. కింగ్‌కోటీ ....సాయంత్రం ... కారు యాక్సిడెంటు....అన్నీ భూతాల్లాగ కళ్లముందు కదిలాయి.

